# ప్రపంచ కమ్యూనిస్టు మహానేత కామ్రేడ్ స్టాలిన్



**సుమారు** 30 ఏళ్ళకు పైగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రప్రథమ సోషలిస్టు రాజ్యానికీ, 40 ఏళ్ళకుపైగా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీకి, సుమారు 60 ఏళ్ళపాటు సోవియట్ ప్రజానీకానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ స్టాలిన్ మరణించి ఈ (2018)) మార్చి 5కు 65 సంవత్సరాలు. కమ్యూనిస్టు శిబిరానికి చెందని ప్రఖ్యాత తెలుగు కవి, జంధ్యాల పాపయ్యశాస్త్రి (కరుణశ్రీ) ***“విశ్వవైతాళికుడి”***గా భావించి ***“రైతుకు పట్టం కట్టిన రష్యా భాగ్యవిధాత అతడు, కూలీకి కిరీటం పెట్టిన స్టాలిన్ మహానేత అతడు”*** అని కామ్రేడ్ స్టాలిన్‌ను కీర్తించినా రకరకాల అవకాశవాదులు, అభివృద్ధి నిరోధకశక్తులు, సోషలిస్టు వ్యవస్థ విచ్ఛిన్నకులు, కుహనా మేధావులచేత వక్రీకరణలకూ, అపవాదులకూ, నిందలకూ, వ్యక్తిత్వ విధ్వంసానికీ (క్యారెక్టర్ ఎసాసినేషన్) ఆయన గురయ్యాడు. అనేక కష్టభరిత గడ్డుకాలాల్నీ, అడ్డుగోడల్నీ అధిగమించి ప్రపంచ ప్రజల శత్రువైన ఫాసిస్టు దుష్టశక్తులను ఓడించి, రెండవ ప్రపంచ మహాయుద్ధంలో అశేష త్యాగాలు చేసిన సోవియట్ ఎర్రసైన్యానికీ, ప్రజానీకానికీ, వారిని నడిపించిన కమ్యూనిస్టుపార్టీకి నాయకత్వ బాధ్యతలు వహించిన కారణంగా విశ్వ వైతాళికుడిగా స్టాలిన్ జేజేలు అందుకున్నాడు.

వారివారి అవగాహనల అంతిమ పరిశీలనలో స్టాలిన్‌ను మార్క్సిస్టు–లెనినిస్టుగా పరిగణిస్తున్నారా? లేదా? అనే గీతలపైన కమ్యూనిస్టు పార్టీలను, సంస్థలను, వ్యక్తులను బేరీజు వేసుకోవాల్సిన విధంగా సిద్ధాంత–ఉద్యమ విభజన రేఖలు ఇప్పటికే ఏర్పడివున్నాయి.

1953లో, కామ్రేడ్ స్టాలిన్ మరణానంతరం, మార్క్సిజం – లెనినిజంకు తూట్లు పొడవటానికి, సోవియట్ రాజ్యాన్ని సోషలిస్టు బాటనుండి తప్పించి కాలక్రమంలో పెట్టుబడిదారీ రాజ్యంగా పునరుద్ధరించటానికి, అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్టాలిన్ 30 ఏళ్ళపాటు సాగించిన పోరాట పంథాను తల కిందులుచేసి, సామ్రాజ్యవాదంతో శాంతియుత సహజీవనం పేరిట కుమ్మక్కు–పోటీ రాజకీయాలు నడపటానికీ, కృశ్చేవ్ నాయకత్వం స్టాలిన్‌పైన నీచమైన దాడికి పూనుకుంది. పైకి అది స్టాలిన్ పైన వ్యక్తిగత దాడిగా కనిపిస్తున్నా, అది అంతిమ సారాంశంలో మార్క్సిజం–లెనినిజంలోని విప్లవ సారాన్ని, సిద్ధాంత–ఉద్యమ–నిర్మాణపంథాలోని అత్యంత విలువైన భాగాన్ని తొలిచి వేయటానికి పూనుకున్నది. 1956లో సోవియట్ పార్టీ 20వ మహాసభలో కృశ్చేవ్ ప్రవేశపెట్టిన రహస్య నివేదిక మొదటగా అమెరికా దేశంలో బహిరంగమైంది. అది ప్రపంచవ్యాపితంగా దోపిడీ, అభివృద్ధి నిరోధకశక్తులకూ, భూస్వామ్య – బూర్జువా వర్గాలకూ ఎనలేని ఆనందాన్నివ్వగా, కమ్యూనిస్టు శ్రేణులకు, ఉద్యమాభిమానులకూ విచారాన్ని కలిగించింది. మార్క్సిజం – లెనినిజంపై దాని సిద్ధాంత – ఆచరణలపై సరికొత్త దాడులకు తలపడే వారందరకూ అబద్ధాల పుట్ట అయిన కృశ్చేవ్ రహస్య నివేదిక ఒక ఆలంబనగా వుంటూ వస్తోంది. స్థూలంగా కామ్రేడ్ స్టాలిన్ విశిష్టతను మనమిప్పుడు చూద్దాం.

**నికృష్ట పేదరికంనుండి...**

స్టాలిన్ పుట్టుకరీత్యా జార్జియన్ జాతికి చెందినవాడు. ట్రాన్స్‌కకేషియాలోని టిప్లిస్ రాష్ట్రంలో దాని రాజధాని అయిన టిప్లిస్ పట్టణంలోగల గోరీ అనే బస్తీలో 1879 డిసెంబరు 21న స్టాలిన్ పుట్టాడు. ఆయన అసలు పేరు జోసఫ్ విసారినోవిచ్ జుగాష్విలి. లెనిన్‌చే ఉక్కు మనిషి(స్టాలిన్)గా గుర్తించబడినందువల్ల, స్టాలిన్ అన్న పేరే స్థిరపడి ప్రాచుర్యం పొందింది.

ఆయన తండ్రి ఇవనోవిచ్ తన స్వంత గ్రామంలో వొక అర్థబానిస. జార్ చక్రవర్తి అర్థబానిస విధానాన్ని రద్దుచేసిన పిదప గోరీ అనే బస్తీకి చెప్పులు కుట్టుకు జీవించేందుకు వెళ్ళాడు. స్టాలిన్ తల్లి ఎకటిరీనా చాలాకాలం బతికింది. ఆమెకు చిన్నవయసులోనే పెళ్ళయింది. ఆ రోజుల్లో ఆమె చాకిరీ చేస్తేగానీ వారి కుటుంబ సభ్యుల పొట్ట నిండేది కాదు. అందుకే ఆమె ఇళ్ళలో బట్టలు ఉతికేది. ముగ్గురు పిల్లలు పుట్టీ పుట్టగానే చనిపోయారు. బ్రతికి బట్టకట్టింది నాల్గవవాడైన జోసఫ్ ఒక్కడే. స్టాలిన్ ప్రాథమిక విద్య గోరీ అనే బస్తీలోనూ, ఉన్నత పాఠశాల విద్య జార్జియా రాజధాని టిప్లిస్ పట్టణంలోగల “ఆర్థడాక్స్ థియోసాఫికల్ సెమినరీ” అనే క్రిస్టియన్ మిషనరీ పాఠశాలలో సాగింది. అందులో 1894లో చేరాడు. కులీనుల పిల్లలు ఎక్కువమంది వుండే ఈ పాఠశాలకు, తల్లీ, తండ్రీ ప్రతికోపెక్కు కూడబెట్టి పంపించేవారు. ఒక చెప్పులు కుట్టేవాని కొడుకు తమతో కలిసి చదవటంపట్ల స్కూల్లోని ఉన్నతవర్గాల పిల్లలు స్టాలిన్‌ను చులకనగా చూచేవారు. వారంతా రష్యన్లు, ఆర్మీనియన్లు, లేదా యూదులు. జార్జియా నుంచి ఇంకా బూర్జువావర్గం పైకి రాలేదు కనుక జార్జియన్లపట్ల చిన్నచూపు వుండేది. అందునా స్టాలిన్ చెప్పులు కుట్టుకు జీవించే కుటుంబం నుండి వచ్చినవాడు అయినందున మరింత చులకనగా చూచేవారు.

జోసెఫ్ తెలివైన విద్యార్థి కనుక బైబిల్‌నే కాక యితర పాఠాలుకూడా బాగా చదివేవానిగా పేరు తెచ్చుకున్నాడు. అయితే పాఠశాలను నడిపే మతాధికారుల శృతిమించిన పెత్తనం స్టాలిన్‌కు నచ్చలేదు. అతనిలో ఛాందసభావాలపట్ల, కఠిన పెత్తందారీ విధానాలపట్ల వ్యతిరేకత, ఆగ్రహం పెరగసాగాయి. తన పదిహేనేళ్ళ వయసులోనే అతనొక విప్లవ భావుకునిగా రూపొందసాగాడు.

అప్పటికే దేశ బహిష్కరణ శిక్షలతో ట్రాన్స్‌కకేషియాలో అజ్ఞాతవాసం కావిస్తున్న రష్యన్ మార్క్సిస్టు బృందాలతో,

విప్లవోద్యమంతో సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. అపుడపుడు విప్లవ సాహిత్యం చదువుతూ మతాధికారులకు దొరికిపోయేవాడు. 1896-97లో తమ విద్యాలయంలోనే 'మార్క్సిస్టు స్టడీ సర్కిల్' అనే అధ్యయన బృందాన్ని ఏర్పరచి, నిర్వహించాడు. 1898 ఆగస్టులో 'రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ'(ఆర్.ఎస్.డి.ఎల్.పి) టిఫ్లిస్ శాఖలో స్టాలిన్ సభ్యుడైనాడు. అదేవిధంగా "జార్జియన్ సోషల్ డెమోక్రటిక్ సంస్థ" ప్రారంభ దశలోనే అతను సభ్యత్వం స్వీకరించాడు.

స్టాలిన్ విజ్ఞాన తృష్ణ అపారం. తత్త్వశాస్త్రం, రాజకీయార్ధిక శాస్త్రాలు, చరిత్ర గ్రంథాలు, పదార్ధ విజ్ఞానశాస్త్రాల్ని పట్టుదలతో చదివాడు. మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలతోపాటు ప్రాచీన సారస్వతంలోని ఉద్గ్రంధాలు కూడా అధ్యయనం చేశాడు. కార్మిక సమావేశాల్లో పాల్గొన్నాడు. అనేక కరపత్రాలు రాసి ప్రచురించాడు. విప్లవోద్యమ తొలిపాఠాలు నేర్చుకుంటూ రైల్వే వర్క్ షాపునకు చెందిన కార్మికులనుండి తొలిసారిగా విప్లవ పాఠాలు నేర్చుకున్నానని చెప్పుకున్న స్టాలిన్ 'టిఫ్లిస్ కార్మికులే నా తొలి గురువులు" అని పేర్కొన్నాడు.

ఈ క్రమంలో స్టాలిన్ విప్లవ కార్యకలాపాల రహస్యం పాఠశాల యాజమాన్యంకు అర్థమై పోగా, "మార్క్సిస్టు భావాలు ప్రచారం చేస్తున్నాడ"నే ఆరోపణతో 29-5-1899న విద్యాలయంనుండి బహిష్కరించారు. అందువల్ల కొంతకాలంపాటు అతితక్కువ ప్రతిఫలానికే ట్యూషన్లు చెప్పుకుంటూ, తర్వాత టిఫ్లిస్‌లోనే ఫిజికల్ అబ్జర్వేటరీలో పనిచేశాడు. లెనిన్ అప్పటికే నడుపుతున్న 'లీగ్ ఆఫ్ స్ట్రగుల్ ఫర్ ది ఎమాన్సిపేషన్ ఆఫ్ ది వర్కింగ్ క్లాస్' (కార్మిక విమోచనా పోరాట సంఘం) ప్రభావంతో టిఫ్లిస్‌లో స్టాలిన్ 'రివల్యూషనరీ సోషల్ డెమోక్రాట్స్' అనే సంస్థ ఆధ్వర్యాన కార్యకలాపాలు సాగించాడు. 1900 సం॥లో లెనిన్ పంపగా టిఫ్లిస్‌కు వచ్చిన 'విక్టర్ కుర్నట్ విస్కీ' అనే కామ్రేడ్ స్టాలిన్‌తో చేతులు కలిపి విప్లవ కార్యక్రమాల వ్యాప్తికి కృషిసల్పాడు. ఆ సంవత్సరమే లెనిన్ ప్రారంభించిన 'ఇస్క్రా' పత్రిక ఆశయ, లక్ష్య, విధానాల్ని స్టాలిన్ పూర్తిగా బలపరుస్తూ అనుసరించాడు. విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మిస్తూ, రహస్య పత్రికలు నిర్వహిస్తూ, పోలీసు నిర్బంధాన్నుండి తప్పించు కుంటూ, వివిధ రూపాలలో తలెత్తుతూండిన మితవాద, అవకాశవాద, అరాచక ధోరణులకు వ్యతిరేకంగా ఆంతరంగిక సిద్ధాంత - రాజకీయ పోరాటం సాగిస్తూ లెనిన్ నాయకత్వాన రూపొందిన బోల్షివిక్ పార్టీ పంధాను స్టాలిన్ దృఢంగా ఎత్తి పట్టాడు. ఒక ఉత్తమ బోల్షివిక్కుగా రూపొందాడు. ఈ క్రమంలో ఐదుసార్లు అరెస్టులు, ప్రవాస శిక్షలు, పారిపోయి రావటాలూ రహస్య నిర్మాణ కార్యకలాపాలూ సాగించాడు. అంచ లంచలుగా పార్టీ బాధ్యతలు స్వీకరిస్తూ, వివిధ రకాల సవాళ్ళను ఎదుర్కొంటూ 1912లో బోల్షివిక్ పార్టీ కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాడు. 1922లో అప్పటివరకు పార్టీలో లేని ప్రధాన కార్యదర్శి పదవిని సృష్టించి లెనిన్ స్వయంగా స్టాలిన్ పేరుని దానికి ప్రతిపాదించి ఎంపిక చేశాడు.

**ఒక దేశంలో సోషలిజం?**

ఒక దేశంలో సోషలిజాన్ని నిర్మించటం అన్నది ఆచరణకు సంబంధించిన సమస్య. అయితే అది నాటికీ నేటికీ ఒక సైద్ధాంతిక సమస్యగా గతంలో పెద్దఎత్తున లేవనెత్తినవారూ, ఈనాటికీ వివాదంగా చర్చిస్తున్న ట్రాట్స్కీ అనుయాయులూ వున్నారు. పారిశ్రామికంగా, వ్యావసాయకంగా వెనుకబడిన రష్యాలాంటి దేశంలో కాకుండా కార్మికవర్గ విప్లవం అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాలలో ముందు రావచ్చునని మార్క్స్ చెప్పిన మాటను ఉటంకించి రష్యాలో బోల్షివిక్ విప్లవాన్ని నిరాకరించిన, నిర్లక్ష్యం చేసినవారున్నారు. ఒక దేశంలో సోషలిజం సాధ్యంకాదని వాదించిన వారి మూలాలు ఒక దేశంలో విప్లవం సాధ్యంకాదనే వారి వాదనతో ముడిపడి వున్నాయి.

అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలు తమ మార్కెట్ల విస్తరణలో భాగంగా ప్రపంచాన్ని వలసలుగా, అర్ధవలసలుగా పంచుకొని అందుకు తమ నడుమ పోటీపడుతూ, సామ్రాజ్యవాద దశకు చేరుకున్నాయనీ అవి అనివార్యంగా తమ నడుమ ఘర్షణను యుద్ధంద్వారా తప్ప తేల్చుకోలేని స్థితికి చేరిన ఫలితమే మొదటి ప్రపంచయుద్ధమని లెనిన్ స్పష్టంచేశాడు. అభివృద్ధిచెందిన దేశాలలోని కార్మికవర్గం తమ తమ దేశీయ ప్రభుత్వాలకూ, బూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా విప్లవ పోరాటాలకు సన్నద్ధం కావాలని కూడా సూచించాడు. కానీ రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన కాట్స్కీ అనుయాయులు లెనిన్ సూత్రీకరణను తిరస్కరించి కార్మికవర్గాన్ని ఆయా దేశాల బూర్జువా పాలకుల సమర్ధకులుగా మార్చారు. దీనికి భిన్నంగా రష్యా దేశంలో లెనిన్ వర్గయుద్ధాన్ని తీవ్రతరంచేసి, ఆనాటికి సామ్రాజ్య వాదమనే గొలుసులో బలహీనంగా వున్న జార్ ప్రభుత్వమనే 'లింక్'ను బద్దలుకొట్టి విప్లవాన్ని విజయవంతం చేశాడు. ప్రపంచ బూర్జువా విప్లవాలలో దేనితో పోల్చినా రష్యా విప్లవం అతితక్కువ రక్తపాతంతో జరిగింది. అయితే దాన్ని నిలబెట్టుకోవటానికీ, విదేశీ దాడులు, స్వదేశీ ద్రోహులనుండి తట్టుకోవటానికీ చాలా మూల్యం చెల్లించవలసి వచ్చింది. మొదటి ప్రపంచయుద్ధం పూర్వ స్థితికంటె, రష్యా స్థితి భయంకరంగా విధ్వంసమయిపోయింది. ట్రాట్స్కీ, జినోవీవ్, కామినేవ్, బుఖారిన్‌లాంటి పార్టీ ముఖ్యులే వివిధ దశలలో లెనిన్ తీసుకున్న వైఖరులకు, లెనిన్ విధానాలకు, వ్యూహం- ఎత్తుగడలకు అడ్డుపడుతూ వుంటే స్టాలిన్ దృఢంగా లెనిన్ పక్షం వహించి, ఒక దేశంలో విప్లవమూ, ఒక దేశంలో సోషలిజమూ సాధ్యమేనని రుజువుపర్చాడు.

విప్లవ ఎత్తుగడలలో ముందడుగుల్ని ఆమోదించటమూ, అనుసరించటమూ కంటే, వెనకడుగుల్ని అర్థంచేసుకొని తదనుగుణంగా వ్యవహరించటం ఎక్కువ కష్టం. జర్మన్ ప్రభుత్వంతో ఒక రాజీగానే చేసుకున్న 'బ్రెస్ట్‌లితోవస్కీ' సంధిని లెనిన్ ప్రతిపాదించినపుడూ; వెనుకబడిన రష్యా నేరుగా సోషలిజంలోకి ప్రవేశించలేదనీ, నూతన ఆర్థికవిధానం అనే పెట్టుబడిదారీ అభివృద్ధిపంథాను కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన కార్మికవర్గం అనుసరించాల్సి వుందనీ లెనిన్ చేసిన ప్రతిపాదనను స్టాలిన్ దృఢంగా బలపరిచాడు. ఒక మోతాదులో పెట్టుబడిదారీ ఉత్పత్తికి అవకాశం యిస్తూనే శ్రామికవర్గ శక్తులను సంఘటితపరుచుకొని లెనిన్ తదనంతరం పంచవర్ష ప్రణాళికలు రచించి, వాటి లక్ష్యాలను 4 ఏళ్ళలోనే సాధించే విధంగా జరిగిన కృషికి స్టాలిన్ సారధ్యం

వహించాడు. ఒక దేశంలో సోషలిజం సాధ్యమేనని ఆచరణలో రుజువు పర్చాడు. "మనం అభివృద్ధిచెందిన దేశాలకన్నా 50 లేదా వందేళ్ళు వెనుకబడి వున్నాం. ఈ దూరాన్ని 10 ఏళ్ళకు తగ్గించు కోవాలి. అలా చేయలేకపోతే వారు మనలను నలిపేస్తారు" అని 1931లోనే స్టాలిన్ హెచ్చరించి, దేశాన్ని ముమ్ముందుకు నడిపించాడు.

**లెనినిజాన్ని నిర్వచించినవాడు-స్టాలిన్**

మార్క్స్ తనది మార్క్సిజం అని చెప్పుకో లేదు. లెనిన్ తన అధ్యయనమూ, ఆచరణనుండి రూపొందించిన సిద్ధాంతాలను లెనినిజం అని చెప్పుకోలేదు. మొదటిసారి లెనినే "మార్క్స్- ఏంగెల్స్-మార్క్సిజం" అనే సిద్ధాంత పత్రం ద్వారా మార్క్స్ - ఏంగెల్స్‌ల బోధనలకు మార్క్సిజం అని పేరు పెట్టాడు. గడిచిన 90 ఏళ్ళుగా ప్రపంచం 'మార్క్సిజం-లెనినిజం' అనే పదబంధాన్ని విరివిగా వాడుతోంది. లెనిన్ బోధనలను లెనినిజం అని ఎందుకు అనాలో మొదటిసారిగా 'లెనినిజం పునాదులు' ద్వారా నిర్వచించినవాడు స్టాలిన్.

"లెనిన్ ప్రాపంచిక దృక్పథం, లెనినిజం పునాదులు రెండూ వొకటి కాదు. లెనిన్ మార్క్సిస్టు కాబట్టి ఆయన ప్రాపంచిక దృక్పథం యొక్క పునాది మార్క్సిజం" అని చెప్పాడు స్టాలిన్. "లెనినిజాన్ని వివరించడమంటే మార్క్సిస్టు విజ్ఞాన సంపదకు ప్రత్యేకంగా లెనిన్ తోడు చేసిన విశిష్టమైన నూతన విషయాలను వివరించడం" అని కూడా అన్నాడు. అలా చెబుతూ లెనినిజాన్ని కొద్దిమాటలలో ఇలా నిర్వచించాడు స్టాలిన్. "లెనినిజం సామ్రాజ్యవాదంయొక్క శ్రామిక వర్గ విప్లవంయొక్క శకమునకు చెందిన మార్క్సిజం. ఇంకా సరిగా చెప్పాలంటే జనరల్‌గా శ్రామికవర్గ విప్లవంయొక్క సిద్ధాంతమూ ఎత్తుగడలూ లెనినిజం. ప్రత్యేకంగా శ్రామికవర్గ నియంతృత్వం యొక్క సిద్ధాంతమూ ఎత్తుగడలూ లెనినిజం".

"ఒకవైపున మార్క్స్-ఎంగెల్సులు, రెండవ వైపున లెనిన్-వీరిమధ్యనున్న మొత్తం కాలంలో రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన అవకాశవాదం అవిచ్ఛిన్నమైన ప్రభావాన్ని పొందింది. ఈ అవకాశవాదానికి వ్యతిరేకంగా నిర్దాక్షిణ్యమైన పోరాటాన్ని సాగించటం లెనినిజంయొక్క అతి ప్రధానమైన కర్తవ్యాలలో ఒకటిగా వుండటం తప్పనిసరయింది". (లెనినిజం పునాదులు : 6-7 పుటలు)

శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతంగా లెనినిజం ఏ చారిత్రక మూలాలనుండి ఆవిర్భవించినదో విశ్లేషించిన స్టాలిన్, లెనినిజాన్ని సమకాలీనతకు అన్వయించుకోవటంలో ఎదురయిన, అవగాహన సమస్యలను ఆత్మవిమర్శనాత్మకంగా చర్చించు కోవటాన్ని గురించి వివరిస్తూ "ప్రపంచంలో అన్నిదేశాల కార్మికోద్యమం నుంచీ మనం పొందే మొత్తం అనుభవమే సిద్ధాంతం. అది లేకుంటే విప్లవ సిద్ధాంతమనే వెలుగులేని చీకటిలో తడుముకున్నట్లే. విప్లవ కార్యాచరణ లేకపోతే సిద్ధాంతం, చుక్కానిలేని పడవ మాదిరిగా గమ్యస్థానం తెలియక తారట్లాడుతుందన్న మాట నిజమే కానీ సిద్ధాంతానికీ, కార్యాచరణకూ అవినాభావ సంబంధం వున్నట్లయితే కార్మికోద్యమానికదొక బ్రహ్మాండమైన శక్తిగా ఉపయోగపడుతుంది" అంటూ లెనినిస్టు సిద్ధాంతాన్ని పరిచయం చేస్తాడు స్టాలిన్.

"శాస్త్రీయ విజ్ఞానరంగంలో లభించిన ప్రధాన విషయాలనన్నింటినీ భౌతికవాద దృష్ట్యా సిద్ధాంతీకరించిందీ, సమకాలీనులయిన మార్క్సిస్టుల భౌతికవాద వ్యతిరేక ధోరణులను ఆమూలాగ్రంగా విమర్శించిందీ, ఏంగెల్స్ తర్వాత లెనిన్ ఒక్కడే" నని లెనిన్ చేసిన సైద్ధాంతిక కృషిని ఎత్తిచూపాడు స్టాలిన్. అలా లెనినిజంయొక్క సైద్ధాంతిక పునాదులు ఆచరణతో ఎలా సమన్వయమైనాయో, వివిధ రంగాల సోదాహరణ అన్వయాన్ని **"లెనినిజం పునాదులు**లో స్టాలిన్ సవివరంగా చెబుతాడు. లెనినిజంయొక్క సైద్ధాంతిక సమస్యలే కాక దాని ఆచరణ సమస్యలను కూడా "లెనినిజం సమస్యలు" అనే వేరే అంశంగా ఆచరణ రూపంలో వ్యక్తమయే సున్నిత సైద్ధాంతిక సమస్యలుగా సవివరంగా చర్చించి పార్టీ శ్రేణులకు కామ్రేడ్ స్టాలిన్ అవగాహన కల్పించాడు.

**వ్యవసాయ-పారిశ్రామికరంగాల అభివృద్ధి**

స్టాలిన్ నాయకత్వానగల బోల్షివిక్‌పార్టీ సోవియట్ యూనియన్ను పారిశ్రామికవంతం చేయాలని తీర్మానించుకుంది. యంత్రాలను ఉత్పత్తిచేసే భారీ యంత్రాగారాలు, దేశరక్షణ కవసరమైన ఆయుధాలను ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీలు స్థాపించుకోవాలి. అందుకవసరమైన మూల ధనాన్ని సామ్రాజ్యవాద-పెట్టుబడిదారీ దేశాలు సమకూర్చుకున్నట్లు రష్యాకు సాధ్యంకాదు. జాతికి లభించిన వనరులతోనే పరిశ్రమల్ని స్థాపించి, నిర్వహిస్తూ - కార్మికుల ఉత్పత్తి శక్తిని పెంచి, ఉత్పత్తి ఖర్చుల్ని తగ్గించుకుంటూ-శ్రామికుల జీవన ప్రమాణాల్ని క్రమంగా పెంచుకుంటూ ముందంజవేయటమే దానికి మార్గం.వ్యవసాయ రంగాన్ని సోషలిస్టు ప్రాతిపదికపై (సమష్టి వ్యవసాయ క్షేత్రాలు, ఆధునిక యంత్రాల వాడకం మొ॥వి) పునర్వ్యవస్థీకరించుతూ-పరిశ్రమలకు కావలసిన శ్రామికుల్ని సమకూర్చి పారిశ్రామిక ఉత్పత్తిని వ్యవసాయరంగం అభివృద్ధికి సమన్వయించటం ద్వారా దాన్ని సాధించారు.

పరిశ్రమలకు కావలసిన పెట్టుబడికీ, ముడిసరుకుకు-జాతీయం చేయబడిన గనులూ, ఖనిజ సంపదల్నీ - పెద్ద పెద్ద ఫ్యాక్టరీలనూ, ధనికుల స్థిర-చర ఆస్తుల్నీ-బ్యాంకులలో ధనాన్నీ, పెద్ద ఎస్టేట్ల భూముల్నీ వినియోగించదలిచారు. వీటి ఫలితంగా ఎదురయ్యే అంతర్గత తిరుగుబాట్లను, విద్రోహాలను తట్టుకుని ఎదుర్కొనే విధంగా పార్టీ నిర్మాణాన్ని సంసిద్ధం చేశారు.

ఈ జరుగుతున్న సోషలిస్టు నిర్మాణం ప్రజలకోసమేననే చైతన్యం, నమ్మకం ప్రజలకు కలిగింది. స్వచ్ఛందంగా అదనపు పనిగంటలు పనిచేసి ప్రపంచంలోనే ఎవరూ ఊహించనంత వేగంగా అభివృద్ధిపథంలోకి దూసుకువెళ్ళారు. తమకాళ్ళమీద తమ దేశాన్ని నిర్మించుకున్నారు.

సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు 4 సం॥లలోనే పూర్తయ్యాయి. వెనకబడిన రైతు రష్యా, అంతర్యుద్ధంలో దాదాపు అధోగతికి చేరిన రష్యా, 1933 నాటికి ప్రపంచంలో రెండవ పారిశ్రామిక దేశంగా తయారయిందని స్టాలిన్ ప్రకటించాడు. కార్మికుల సంఖ్య, పారిశ్రామిక ఉత్పత్తి రెట్టింపయినాయి. అంతవేగంగా అభివృద్ధిజరగకపోతే సోషలిస్టు నిర్మాణం

వాయిదా పడటమేకాక తమ జాతి ఉనికికే ప్రమాదం వచ్చేదని ప్రజలు నమ్మారు. అందుకే కష్టానికి నిష్టురపడకుండా అహో రాత్రులు శ్రమించారు. చరిత్రలో తొలిసారి తమ కష్టానికి ఫలితాల్ని తామే అనుభవించటమనే దాన్ని చవిచూశారు.

వ్యవసాయరంగంలో, గ్రామీణ ప్రాంతాలలో మార్పులు చాలా వత్తిళ్ళనడుమ, పొరపాట్లను సరిదిద్దుకుంటూ, పైకి చూస్తే అస్తవ్యస్తంగా వున్నట్లనిపిస్తూ ఎంతో సంఘర్షణతో సాగింది. ప్రజలపై మత పెద్దలపట్టు, కుటుంబాలపై వయోవృద్ధులపట్టు, పితృస్వామిక భావజాలాల పట్టు, మొత్తంగా కులక్కులకు రైతాంగంపై గల పెత్తనం...వీటన్నిటినీ, తట్టుకుంటూ, ఎదుర్కొంటూ, విద్రోహాలనుండి కాపాడుకుంటూ సాగింది.

సమష్టి వ్యవసాయ క్షేత్రాలను ప్రోత్సహించే క్రమంలో అత్యుత్సాహంతో కొంత, తెలిసీ తెలియక మరికొంత, ప్రజలనుండి నేర్చుకునే విధానం అమలుకానందునా, విద్రోహుల్ని పసి కట్టలేకా... యిలా చాలా పొరపాట్లే జరిగాయి. ప్రకృతి సహజంగా సంభవించిన కరువు కాటకాలు కూడా ప్రజల యిక్కట్లను పెంచాయి. అయినా తట్టుకుని ప్రజానీకం నిలబడ్డారు. జరిగిన తప్పులకు బాధ్యత పార్టీదేనని కేంద్రకమిటీ ప్లీనం సమావేశంలో స్టాలిన్ అంగీకరించాడు. ఏమరుపాటుతో దెబ్బతిన్నదని చెప్పాడు. తరవాత అత్యవసర పరిస్థితి కలిగినపుడు సకాలంలో సరైన చర్యల్ని తీసుకున్నారు. 1935 నాటికి కొత్త తరహా వ్యవసాయానికి స్థిమితం చేకూరింది.

ఈలోగా విదేశీ పత్రికలు "రైతులపై స్టాలిన్ యుద్ధం" అని శీర్షికలు పెట్టి వార్తలు రాశాయి.

ఈ క్రమంలో ప్రజలలో నిరక్షరాస్యతను నిర్మూలించటం, మతం వ్యాప్తిచేసిన మూఢ విశ్వాసాలను పోగొట్టటం, మహిళలను సమస్త రంగాలలో ముందుకు చురుకుగా అభివృద్ధి చెందేవిధంగా వివిధ రంగాల్లో నాయకత్వపు స్థానాలు పొందేవిధంగా ప్రోత్సహించటం పెరిగింది. ఈ భౌతిక – బౌద్ధిక అభివృద్ధికి, ఆర్థిక – సాంస్కృతిక ప్రగతికి సోవియట్ యూనియన్ అనుసరించిన సోషలిస్టు ఉత్పత్తి పంపిణీ విధానాలు నేర్చుకుంటూ, తప్పులు దిద్దుకుంటూ సాగించిన బోల్షివిక్ పార్టీ కార్యకర్తల కృషి...వీటన్నింటికీ నేతృత్వం వహించిన కామ్రేడ్ స్టాలిన్ దీక్షాదక్షత కారణమని చెప్పవచ్చు.

లెనిన్ మరణానంతరం బోల్షివిక్ పార్టీని చీల్చాలని, ట్రాట్స్కీ నాయకత్వాన కామినేవ్, జినోవీవ్, బుఖారిన్‌లు పరిపరివిధాల ప్రయత్నించారు. బోల్షివిక్ అనుచరుల గుండె నిబ్బరాన్ని నీరుగార్చాలనుకున్నారు. సోవియట్ యూనియన్‌లో సోషలిజం విజయం సాధ్యం కాదనే అపనమ్మకాన్ని వ్యాపింపచేయాలని తలచారు. అడుగడుగునా వీరి విచ్ఛిన్నాలను కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన పార్టీ కార్యకర్తలు ఎదుర్కొనబట్టే పై అభివృద్ధిని నిజం చేయ గలిగారు.

స్వచ్ఛంద అధికోత్పత్తి బృందం(స్టఖనోవ్ వర్కర్స్) మొదటి సభలో మాట్లాడుతూ స్టాలిన్ యిలా అన్నాడు.

"మన (బోల్షివిక్) విప్లవకమిటీ పెట్టుబడిదారీ విధానపు సంకెళ్ళను తుత్తినియలుచేసి, ప్రజలకు స్వాతంత్ర్యం సమకూర్చుటయేకాక, ప్రజలకు సౌభాగ్యవంతమైన జీవితానికి అవసరమైన భౌతిక పరిస్థితులను సృష్టించుటలో కూడా విజయం పొందింది. ఇందులోనే మన విప్లవ బలమూ, అజేయశక్తీ యిమిడి వున్నాయి".

**రెండవ ప్రపంచ యుద్ధంలో**

రెండవ ప్రపంచ యుద్ధ ప్రారంభానికి 3 సం॥ముందు స్పానిష్ సివిల్‌వార్ వచ్చింది. స్పైన్ దేశంలో ఎన్నికల ద్వారా మెజారిటీ సాధించిన ప్రజాతంత్రవాదులకు, కమ్యూనిస్టులకూ అధికారం అప్పజెప్పకుండా జనరల్ ఫ్రాంకో మిలటరీ తిరుగుబాటు చేయించి క్రూర అణచివేత విధానాలను అమలుపరిచాడు. ప్రజల సాయుధ ప్రతిఘటనతో అంతర్యుద్ధం వచ్చింది. ప్రజా స్వామికశక్తుల విజయంకోసం అంతర్జాతీయ బ్రిగేడును ఏర్పరచి, వారికి భౌతిక, నైతిక మద్దతు నందించాడు స్టాలిన్. హిట్లరు, ముస్సోలినీలు (జర్మనీ, ఇటలీ) జనరల్ ఫ్రాంకో పక్షాన నిలిచారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు దోబూచులాట లాడాయి. స్పెయిన్ ప్రజల తరఫున పోరాడ టానికి చాలా దేశాలనుండి (భారతదేశంనుండి కూడా) వాలంటీర్ దళాలు వెళ్ళాయి. అయినా స్పెయిన్ అంతర్యుద్ధంలో ప్రజాస్వామ్యశక్తులు ఓటమి పాలయ్యాయి. అప్పటికే పెరుగుతున్న ఫాసిస్టు ప్రమాదాన్ని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ద్వారా, మాక్సింగోర్కీలాంటి సాహిత్య మేధావుల ద్వారా స్టాలిన్ ప్రజాస్వామికవాదులకూ ప్రపంచ కార్మిక వర్గానికి గుర్తింపచేసి, రష్యాను అప్రమత్తం చేసి, యుద్ధాన్ని హిట్లరు దాడిని ఎదుర్కోవటానికి సంసిద్ధుల్ని చేస్తూవచ్చాడు. సోషలిస్టు రష్యాను ఒంటరినిచేసి నాశనం చేయాలనే దుష్టతలంపు తోవున్న ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలు – హిట్లర్ మూకలను ఓడించలేకపోతే వారి మనుగడకు కూడా ప్రమాదమనే విషయాన్ని స్టాలిన్ గుర్తింపచేసినా మొదట ఖాతరు చేయనివారు ఒక క్రమంలో ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వామిక సంఘటనకు ఆమోదం తెలుపక తప్పలేదు. 1941 నుండి 1944 దాకా హిట్లరు మూకలను వెనుకనుంచి ముట్టడించే 'రెండవ ఫ్రంట్'కి మిత్రదేశాలు (అమెరికా – ఇంగ్లాండ్ – ఫ్రాన్స్) సంసిద్ధులు కాలేదు. ఈలోగా హిట్లరు మూకలదాడిని రష్యా ఒంటరిగా ఎదుర్కొంటూ, భయంకరమైన స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో పైచేయి సాధించిన పిమ్మట విజయ పరంపరకు అది మూలమలుపు అయింది. మొత్తం ప్రపంచ చరిత్రలోనే రెండవ ప్రపంచయుద్ధం అత్యంత భయంకరమైనది. వినాశకరమైనది. మొత్తంగా ప్రపంచాన్నే కబళించాలనే దుష్టపథకంతో జర్మనీ (హిట్లరు), ఇటలీ(ముస్సోలినీ) జపాను (టోజో)లు ఫాసిస్టు కూటమిగా ఏర్పడి సాగించిన దురాక్రమణ యుద్ధాన్ని ఓడించటంలో సోవియట్ యూనియన్‌ది, దాని ప్రజలదీ, వారికి నాయకత్వం వహించిన కామ్రేడ్ స్టాలిన్‌దీ కీలకపాత్ర.

ప్రపంచవ్యాపితంగా ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వారు 5 కోట్లమంది వుంటే,ఒక్క సోవియట్ యూనియన్లో రెండుకోట్లా, 80 లక్షలమంది చనిపోయారు. క్షతగాత్రులు కాని కుటుంబమే ఆ దేశంలో లేదు. స్వయంగా స్టాలిన్‌కూడా తన కొడుకుని యుద్ధంలో కోల్పోయాడు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్నీ, సోషలిస్టు వ్యవస్థనూ కాపాడుకోవటానికి సోవియట్ ప్రజానీకమంతా

ఒక్కటై ఒక మహాశక్తిగా నిలిచి పోరాడిన ఫలితంగా వారికి గెలుపు సాధ్య పడింది. 20 ఏళ్ళుగా తాము కష్టపడి నిర్మించుకున్న సోషలిస్టు వ్యవస్థ, అది తమదీ అనీ, దాన్ని కోల్పోతే హిట్లరు ముష్కరులు అమలుజరిపే బానిసత్వంలోకి కూరుకు పోతామనే భావన, జాతీయ పౌరుషంనిండిన చైతన్యం కలిగి లేకుంటే వారికది సాధ్యపడేదే కాదు. స్టాలిన్ నాయకత్వంపై సోవియట్ ప్రజానీకానికిగల ప్రగాఢవిశ్వాసం కూడా వారినలా నడిపించింది.

రెండవ ప్రపంచయుద్ధంలో నూటికి 14 మంది సోవియట్ ప్రజానీకం ప్రాణాలు కోల్పోయారు. మరింత మంది గాయాల పాలయ్యారు. వీరిలో కమ్యూనిస్టు శ్రేణులూ, అత్యుత్తమపౌరులూ ఎక్కువమంది వుంటారు. స్టాలిన్ తదనంతర కాలపు పరిణామాలను బేరీజు వేసేటప్పుడు, యుద్ధంలో ఉత్తమ నాయకత్వ శ్రేణులను కోల్పోయిన స్థితిని కూడా పరిగణలోనికి తీసుకోవాల్సి వుంటుంది. ఈ యుద్ధంలో అమెరికాకంటే రష్యా వంద రెట్లు ఎక్కువ నష్టాన్ని పొందింది.

రెండవ ప్రపంచయుద్ధ నిర్వహణలో స్టాలిన్ అనుసరించిన దౌత్యపరమైన ఎత్తుగడలు, ముఖ్యంగా ఇంగ్లాండ్, అమెరికా దేశాధినేతలతో ఆచితూచి వ్యవహరించిన శైలి, తుట్టతుదకు హిట్లరు మూకలను మట్టికరిపించి సాధించిన విజయం...స్టాలిన్‌ని ప్రపంచ అగ్రనేతగా నిల బెట్టింది. 'కమ్యూనిస్టులు నిజమైన శాంతి కాముకులు' అనే భావాన్ని ప్రపంచ ప్రజానీకంపై చెరగని ముద్రగా నిలిపింది. జపాను దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడుతున్న చైనా, కొరియా దేశాలకు స్టాలిన్ ప్రభుత్వం ప్రత్యక్ష సహాయాన్ని అందజేసింది. రెండవ ప్రపంచయుద్ధానంతరం తూర్పు ఐరోపా దేశాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడటానికి దోహదంచేసి, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద కూటమికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు కూటమి రూపొంద టానికి కారణమయింది.

అన్నా లూయీస్ట్రాంగ్ రాసిన 'స్టాలిన్ యుగం'లోని ఈ వాక్యాలు సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు మానవులు రూపొంది నందువల్ల వారు స్వచ్ఛందంగా యుద్ధానికి ఎలా సన్నద్ధమయారో తెలుపుతాయి.

"రష్యాకు బ్రహ్మాండమైన మనుష్యబలం వున్నదని ప్రతివారూ గుర్తించారు. కానీ ఈ మనుష్యబలంలోగల స్వభావశక్తి ఎంతగా మారిందో తెలుసుకున్న వాళ్ళు కొద్దిమందే. శిక్షణపొందిన స్త్రీలు లక్షోప లక్షలుగా రక్షణకు పాటుపడ్డారు. సప్లయిశాఖ, ఇంజనీరింగ్‌శాఖ, రవాణాశాఖ, సైనిక వైద్యశాఖల్లో అంతా వాళ్ళే. సైన్యంలో శారీరకంగా సహకరించటానికి ప్రజలు ఎక్కడికక్కడ సంసిద్ధులయ్యారు. 'శ్రమకూ, రక్షణకూ సిద్ధం' అనే బ్యాడ్జీలను 60 లక్షలమంది ధరించారు. నడక, పరుగు, దూకుడు, ఈత, తెడ్డువేయటం, మంచులో జారటం మొదలైన వాటన్నిటా శిక్షణపొంది సమర్థులైనవారే వీరంతా. చాలామంది ప్యారాచూట్‌తో దూకటం తమంత తాముగా నేర్చుకున్నారు". (పేజీ 125)

**స్టాలిన్ మరణం తర్వాత**

1953 మార్చి 5న కామ్రేడ్ స్టాలిన్ మరణించాడు. ఒక ప్రపంచయుద్ధ విజేతకూ, ప్రపంచశాంతిని ప్రగాఢంగా వాంఛించిన వానికీ యివ్వవలసిన గౌరవ మర్యాదలను – వివిధ దేశాధినేతలు తమ సంతాపం ద్వారా తెలియ పర్చారు.

ఆనాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ "వెనక్కి మరలి ఈ 35 సం॥ల చరిత్ర నొక్కసారి పరికిస్తే ఎందరో వ్యక్తులు తారస పడతారు. అయితే యింకెవ్వరూ కూడా మార్షల్ స్టాలిన్‌తో సాటిగా ఈ యుగ చరిత్రను తీర్చిదిద్ది వుండరు. మలచలేదు. దాన్ని ప్రభావితం చేయ లేదు. క్రమక్రమంగా ఆయన చారిత్రాత్మక వ్యక్తిగా, మరోసారి ఏదో కొద్దిమందితోకాక విస్తారమైన ప్రజానీకంతో ఆత్మీయ సంబంధం కలిగిన వాడుగా కనిపించేవాడు. యుద్ధ సమయంలోనూ, శాంతికాలంలోనూ కూడా గొప్పవాడినని నిరూపించుకున్నాడు. అతికొద్దిమందిలో మాత్రమే కనిపించే వజ్ర సంకల్పాన్నీ, ధీరోదాత్తతనూ ఆయన ప్రదర్శించాడు. భావితరాలవారు ఏఏ అభిప్రాయాలను విభిన్నాభిప్రాయాలను గ్రంధస్తం చేస్తారో నాకు తెలియదు. కాని ఆయన మహోన్నతుడనే విషయాన్ని మాత్రం అందరూ అంగీకరించి తీరుతారు. సమకాలీన యుగపు భవిష్యత్తును తీర్చిదిద్దిన బహుకొద్దిమందిలో ఆయన వొకరు".

"చరిత్రలోని అతిక్లిష్టమైన దశలో ఆయన కర్తవ్య నిర్వహణ చేశాడు. కొంతమంది అభిప్రాయపడుతున్నట్లుగా ఆయన కొన్ని పొరపాట్లు చేసి వుండవచ్చు. దాంతో మనకు నిమిత్తంలేదు. అయితే ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్నీ, సాధించిన ఘనవిజయాలను మాత్రం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఒప్పుకుని తీరాలి".

జపానుపై అణుబాంబులు వేయించిన అమెరికా దేశాధ్యక్షుడు హారీ ట్రూమన్ మాత్రం "తెలిసిన వారు చచ్చిపోతే నేను ఎప్పుడూ విచారపడతానని" పొడిమాటలు వాడాడు.

కమ్యూనిస్టు ప్రపంచమంతా ఒకే సమయంలో 5 నిమిషాలపాటు మౌనం పాటించింది. ఆ సందర్భంగా కొరియాలో కమ్యూనిస్టు సేనలు అనుసరించిన మౌనాన్ని అవకాశంగా తీసుకుని అమెరికా సేనలు వారిపై విజృంభించి పెద్ద దాడి చేశాయి.

**స్టాలిన్‌పై దాడి మార్క్సిజంపై దాడితో సమానమే!**

1917లో స్టాలిన్ ఒక సందర్భంలో "మార్క్సిజంలో పిడివాద మార్క్సిజం వుంది. సృజనాత్మకమైనది వుంది. నేను రెండోదాన్ని ఎంచుకున్నాను" అని ప్రకటించాడు. 'లెనినిజం పునాదులు'ను వివరిస్తూ "ప్రపంచంలో అన్ని దేశాల కార్మికోద్యమం నుంచీ మనం పొందే మొత్తం అనుభవమే సిద్ధాంతం" అంటాడు స్టాలిన్. వీటిలో మొదటిది మార్క్సిజాన్ని సమకాలీన ప్రపంచ, దేశీయ పరిస్థితులలో వర్గ శక్తుల బలాబలాలకు అనుగుణంగా అన్వయం చేసి సిద్ధాంతానికి భౌతిక ఉద్యమ – నిర్మాణ రూపమివ్వటం. రెండవది ఆ అన్వయంనుండి పొందిన అనుభవాన్ని సిద్ధాంతంగా అభివృద్ధి పరచుకోవటం వున్నాయి.

ఇటీవల సిద్ధాంతాల్ని ముడిరూపంలో వల్లెవేయటంతప్ప ఆచరణతో సంబంధంలేని కొందరు స్టాలిన్‌పైనా, ఆయన సారథ్యంలో నిర్మాణమై అభివృద్ధిచెందిన సోషలిజంపైనా బండ విమర్శలను మొండిగా సాగించేవారు తయారయారు. ఇలాంటివారి మూలపురుషుడు నికిటాక్రుశ్చేవ్. 1956లో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభలో, 1956లో రహస్య

నివేదికపేరిట స్టాలిన్ నాయకత్వంకింద గడిచిన 30 ఏళ్ళ కాలంలో సోవియట్ ప్రజలు సాధించిన ఘన విజయాలనన్నిటినీ ఒక్క కలంపోటుతో తుడిచివేయటానికి ప్రయత్నించాడు. చరిత్రలోని సమస్త అవకాశవాదులనుండీ, రివిజనిస్టులనుండీ మార్క్సిస్టు వ్యతిరేక అభిప్రాయాలన్నింటినీ కృశ్చేవ్ పోగుచేశాడు. వాటినుండి సామ్రాజ్యవాదంతో ‘శాంతియుత సహజీవనం’, ‘శాంతియుత ఆర్థిక పోటీ’, ‘శాంతియుత పరివర్తన’ అనే రాజీకోరు విధానాన్ని ప్రవేశపెట్టి “ప్రజలందరి రాజ్యం” (స్టేట్) అనే కాక ప్రజలందరి పార్టీ అనే సమగ్ర రివిజనిస్టు పంధాను రూపొందించాడు. అది సోవియట్ యూనియన్‌లో కార్మికవర్గ నియంతృత్వాన్ని రద్దుపరచి, పెట్టుబడిదారీ పునరుద్ధరణకి తోడ్పడేదిగా ఆనాడే మార్క్సిస్టు –లెనినిస్టులు పరిగణించారు. రష్యా దేశానికేకాక ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమనేతగా స్టాలిన్ తన కాలంలో అమలుజరిపి నిలబెట్టిన మార్క్సిజం– లెనినిజాన్ని బోల్షివిక్ విప్లవస్ఫూర్తిని చైనా కమ్యూనిస్టు పార్టీ, మావోల నాయకత్వాన అందిపుచ్చుకొని నిలబెట్టారు.

స్టాలిన్‌కూడా పొరపాట్లకూ, తప్పులకూ అతీతుడుకాదు. తానెప్పుడైనా తప్పుచేస్తే ఆ తప్పుకు తనకు తాను ఆత్మవిమర్శ చేసుకోగల సత్తా, నిజాయితీ స్టాలిన్‌కుండేవి. చైనా విప్లవ సమయంలో స్టాలిన్ ఒక అపసవ్యమైన సూచన చేశాడు. దాన్ని చైనా పార్టీ పాటించకుండా తమ అనుభవాలనుండి పొందిన గుణపాఠాల ప్రకారం అమలుజరుపుకుంది. చైనా విప్లవం విజయం పొందిన తర్వాత స్టాలిన్ లోగడ తాను యిచ్చిన సూచనలోని తప్పుని ఒప్పుకున్నాడు.

చరిత్ర వత్తిడివల్ల సంభవించిన పొరపాట్లు వున్నాయి. తొందరపాటు నిర్ణయాలు కూడా వుండి వుండొచ్చు. ఏది ఏమయినా స్టాలిన్ గొప్ప మార్క్సిస్టు – లెనినిస్టు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికీ, సోవియట్ యూనియన్లో సోషలిస్టు మానవుడు అభివృద్ధిచెంది ప్రపంచానికే ఆశాజనకంగా నిలవటానికీ, ఎన్నెన్నో ఒడి దుడుకులు, విచ్ఛిన్నాలూ, ఫాసిస్టు దురాగతాలూ తట్టుకొని ధీరోధాత్తునిగా నిలిచినవాడు స్టాలిన్. మార్క్సిస్టు మహోపాధ్యాయుల్లో ఆయన వొకరు.

కామ్రేడ్ స్టాలిన్ సమున్నతంగా నిలిపిన మార్క్సిస్టు – లెనినిస్టు సిద్ధాంతాన్నీ, బోల్షివిక్ స్ఫూర్తినీ ప్రపంచ శ్రామికవర్గం, భారతీయ కార్మికవర్గం అందిపుచ్చుకుని మొక్కవోని దీక్షతో సామ్రాజ్యవాద శక్తులకు, అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలకు సంసిద్ధులవటం ద్వారా ఆయనకు ఘన నివాళిని అందించిన వారమవుతాము.

oooo